# పురాణ ప్రవచకుడు సుతుడు! ఆయన ప్రాణదాతా, జ్ఞానప్రదాత బలరాముడు!



బలరాముడు

కృష్ణుడు కొందరు రాక్షసులను చంపితే బలరాముడు కొందరు రాక్షసులను చంపాడు. కృష్ణుడు ఒంటరిగా వెళ్ళి దైత్యులను చంపినట్టు బలరాముడూ చంపాడు. ఆయన బలదర్పములు అసమాన్యములు. లోకరక్షణకు తక్క లోకుల శిక్షణకు తన ప్రతాపములను ప్రయోగించలేదు. అపారమైన ధర్మ స్వభావుడు. బలరాముడెంతటి పరాక్రమవంతుడో, ధర్మపరుడో చెప్పడానికే ఈ వ్యాసం.

కురుపాండవ యుద్ధం జరుగనున్నదని బలరాముడు గ్రహించాడు. ఏ ఒక్కరివైపూ నిలచిపోరాడాలనే భావం కలుగలేదు. అక్కడే ఉంటూ తటస్థంగా ఉండడమూ ఆయన కిష్టంలేదు. ఆ కారణంగా తీర్థయాత్రలకు వెళ్ళాలని నిర్ణయించుకుని బయల్దేరారు. అనేక తీర్థాలను, క్షేత్రాలను సందర్శించారు. అనునిత్యమూ భగవంతుని చిద్విలాసములతో, భక్తి ప్రపూర్ణత్వం కల ప్రవచనములూ, శ్రవణంతో కూడుకున్న క్షేత్రం నైమిశారణ్యమని ఆయన ఊహకు తట్టింది.

ఆయన తలంచినట్లుగానే నైమిశారణ్యంలో పురాణ ప్రవచనం జరుగుతున్నది. మునిజనం శ్రద్ధగా ఆలకిస్తుండటం, రోమహర్షముని శాస్త్రప్రవచనం చేయడం చూచి బలరాముడక్కడకు వెళ్ళారు. బలరాముణ్ణి చూడగానే శ్రోతలైన సాధువర్యులందరూ లేచి నిలుచున్నారు. పురాణ ప్రవచనం చేస్తున్న రోమహర్షుడనే సూతుడు లేవలేదు. రోమహర్షుడు సూతుడు. బ్రాహ్మణయువతికీ, క్షత్రియ యువకునికీ ఆయన జన్మించాడు. పురాణవిద్యనభ్యసించాడు. కానీ భగవత్ స్వరూపుడైన బలరాముడు వచ్చాడనే కనీస మర్యాదను కూడా అతడు కనబరచలేదు. ఆహ్వానించనూ లేదు. ఆసనము నుంచీ లేవలేదు. అతని అలక్ష్యాన్ని జూచి బలరాముదుగ్రుడై ఒక కుశాగ్రము నతనికిపైకి విసిరాడు. కుశాగ్రం సూతుణ్ణి వధించింది.

బలరాముని రాకతో లేచి నిలుచుని ఉన్న మునిపుంగవులందరూ 'ప్రభూ' ఈ రోమహర్షునికి మేమందరమూ దీర్ఘాయువును ప్రసాదించి, ఈ పురాణ ప్రవచనం చేసే ఆసనమున కూర్చోబెట్టాం. మా శ్రవణకార్యం మధ్యలోనే ఆగిపోయింది. – ఈ బ్రాహ్మణహత్యతో మీకు మహాపాపం సంభవిస్తుంది. మీరు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. మునివర్యుల మాటలతో శాంతించిన బలరాముడు ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి అంగీకరించాడు. రోమహర్షుణ్ణి పునర్జీవితుణ్ణి చేయాలనుకున్నాడు. పూర్ణ స్వతంత్రునకు గానీ అంతటి శక్తి వుండదని మునులకు గ్రాహ్యమే. నీవు ఏదో సంకల్పంతో ఈ రోమహర్షుణ్ణి వధించి ఉంటావు. మీ కార్యం వృధా కాకూడదు. మేము రోమహర్షుణ్ణి దీర్ఘాయు సంపన్నునిగా దీవించాం. మా దీవెనలూ వృధా కాకూడదు. ఈ రెండింటికీ తగ్గే మధ్యే మార్గం ఆలోచించు ప్రభూ అని వేడుకున్నారు.

బలరాముడు వారి విన్నపాన్ని ఆలకించాడు. రోమహర్షుని పుత్రుడైన ఉగ్రశ్రవుడు పురాణ ప్రవచకుడవుతాడు. అతడు తండ్రి శరీరంనుంచే ఉద్భవిస్తాడు కాబట్టి తండ్రి ప్రతినిధేయవుతాడు. తండ్రి స్థానంలో కూర్చుని సమస్త పురాణములనూ ప్రవచించకలిగే సర్వసమర్థుడైన పురాణ ప్రవచన కర్తయ్యే జ్ఞానసిద్ధి కలుగుతుంది. ఇతనికి దీర్ఘాయువును ప్రసాదిస్తున్నాను. ఆరోగ్యమునను గ్రహిస్తున్నాను. శరీరము, ఇంద్రియపటుత్వం గలవాడై, వచోశాలియై, యశశ్శాలియై జీవిస్తాడు. ఉగ్రశ్రవణున్నే సమర్థునిగా, సూతపౌరాణికునిగా ఈ సూత సింహాసనంపై అధిష్ఠింపచేస్తూ, సమస్త పురాణ జ్ఞానాన్నీ శ్రవణయుక్తంగా చెప్ప కలిగే దీర్ఘజ్ఞానిగా అనుగ్రహిస్తున్నానంటూ బలరాముడు ఆది గురుస్థానంలో ఉండి ఆశీర్వదించాడు. బలరామ ఆది గురువు. ఆది గురువు నమోస్తుతే!







శ్రీకృష్ణుడు